క్లుప్తంగా

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



నంద్యాల (వ్యవసాయం): కేరళ రాష్ట్రంలో జరిగే ఓనం పండగను పురస్కరించుకొని ఆదివారం గుడిపాటి గడ్డలోని అయ్యప్పస్వామి ఆలయంలో వేదంపండితులు విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, గంధాభిషేకం అనంతరం పట్టువస్త్రాలతో అలంకరించి కేరళ సంప్రదాయ పద్ధతిలో ప్రసాదలను నైవేద్యంగా సమర్పించారు. వినాయక, నవగ్రహ, అయ్యప్పస్వామి హోమాలు నిర్వహించి పుణ్యాహవచనం జరిపించారు. అయ్యప్ప సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

పెద్దమ్మకు భక్తిశ్రద్ధలతో పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు వసతులను ఏర్పాటు చేశారు.

ఎంఈఓ- 2 లను కొనసాగించాలి

నంద్యాల(న్యూటౌన్): ఎంఈఓ- 2 లను కొనసాగించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామపక్కీరరెడ్డి, భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి సర్వీసు రూల్స్ కేసు పెండింగ్‌లో ఉన్నందున ఉపాధ్యాయులకు ఎంఈఓ-1 పదోన్నతులు నోచుకోని కారణంగా ప్రభుత్వం ఎంఈఓ-2లను కొత్తగా నియమించారన్నారు. ఒకరికి అడ్మినిస్ట్రేషన్ మరొకరికి అకాడమిక్ బాధ్యతలు అప్పగించారు. ఎంఈఓ- 2లను రద్దుచేస్తే దాదాపు 650 కి పైగా గజిటెడ్ పోస్టులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల పోస్టులలో విద్యా వలంటీర్లను నియమించాలన్నారు. మధ్యంతర భృతి, సంపాదిత సెలవులు తదితర బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు సుమయోన్, జగదీశ్, శ్రీమౌలిరెడ్డి, రాజశేఖర రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

రుద్రవరం: మండలంలోని టీ.లింగందిన్నె మెట్ట వద్ద ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును ఎస్‌ఐ వరప్రసాదు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు నుంచి సుబ్బరాయుడు అనే వ్యక్తి టీ.లింగందిన్నెకు తీసుకెళ్తుండగా అక్కడ వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ ట్రాక్టరును నిలిపి అనుమతుల గురించి ఆరా తీయగా.. అనుమతులు లేవని చెప్పడంతో ట్రాక్టరును రుద్రవరం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

నంద్యాల చిన్నారికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



సాయిహవీష్‌ను అభినందిస్తున్న కోటేష్

నంద్యాల(అర్బన్): పట్టణానికి చెందిన పల్లా రమేష్, స్వర్ణ దంపతుల కుమారుడు సాయిహవీష్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. స్థానిక కోటేష్ అకాడమీలో ఆదివారం జరిగిన అభినందన సమావేశంలో ప్రముఖ చిత్రకారుడు కోటేష్ చిన్నారిని అభినందించి మాట్లాడారు. ఏప్రిల్ 14న బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని సాయిహవీష్ డ్రాయింగ్ చార్ట్‌పై 3,022 బొట్టు బిల్లలతో అంబేడ్కర్ పోట్రాయిట్ చిత్రాన్ని గీసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డుకు పంపగా..రికార్డు ఎడిటర్ డాక్టర్ బిష్వరూప్ రాయ్ చౌదరి చిన్నారి వేసిన చిత్రాన్ని పరిశీలించి ఇది అద్భుత ప్రయోగమని ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం కల్పిస్తున్నట్లు తెలిపారన్నారు. సర్టిఫికెట్, గోల్డ్‌మెడల్, గుర్తింపు కార్డులను కొరియర్ ద్వారా పంపారని చెప్పారు.

బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం పట్టణంలోని ఓటీపీ అకాడమీ హాల్‌లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఎన్నిక జరిగింది. నంద్యాల జిల్లా చైర్మన్‌గా బీసీ ఇంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా మహబూబ్‌బాషా, జనరల్ సెక్రటరీ గయాజుద్దీన్‌ను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. న్యాయ సలహాదారుడిగా అలీహుసేన్, నంద్యాల జిల్లా పీఈటీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బత్తుల రవికుమార్ మాట్లాడుతూ బాక్సింగ్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఇన్‌విటేషన్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. వంద మంది బాలురు, 50 మంది బాలికలు పాల్గొని టోర్నమెంట్ విజయవంతం చేసినట్లు తెలిపారు. కోచ్ మహేష్, ట్రెజరర్ అబ్దుల్ వహీద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం విద్యార్థులకు శరాఘాతం



ఎంబీబీఎస్ సీట్ల తగ్గింపు ప్రభుత్వ నిర్ణయం పేద విద్యార్థులకు శరాఘాతమే. నీట్ కోసం ఎంతోమంది ఇంటర్ నుంచే సిద్ధమవుతున్నారు. చాలా మంది లాంగ్, షార్ట్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నారు. రాష్ట్రంలో వైద్య కళాశాలలు అధికంగా ఉంటే స్థానికులకు ఎక్కువ మంది సీట్లు పొందే అవకాశం ఉంటుంది. అయితే ప్రభుత్వ నిర్ణయం వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేసినట్లయ్యింది. కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడి ఇంకా సీట్లు సాధించుకోవాల్సింది పోయి.. ఉన్న సీట్ల తగ్గించమని కేంద్రానికి లేఖ రాయడం ఆశ్చర్యకరం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుంటే విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడగలరు. – మహబూబ్‌బాషా, రిటైర్డ్ ఎంఈఓ, శిరివెళ్ల



పేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం



మా చెల్లెలు కుమార్తె బ్లెస్సీ నీట్‌లో 504 మార్కులు స్కోర్ చేసింది. మా కేటగిరీలో ఈ మార్కులకు సీటు రాదు. అదే ప్రభుత్వ మెడికల్ కళాశాలలు అధికంగా ఉంటే పేద విద్యార్థులు కూడా ఉచితంగా వైద్యవిద్య కోర్సుల్లో సీట్లు పొందుతారు. కానీ మంజూరైన కళాశాలలు పూర్తి చేయకుంటే వచ్చే ఏడాది కూడా రాష్ట్రంలో సీట్లు పెరగవు. దీంతో పేదవిద్యార్థులకు సీట్లు లభించే అవకాశం ఉండదు. సీటును డబ్బుపెట్టి కొనే పరిస్థితి లేకపోవడంతో వారి అవకాశాలు చేజారినట్లే. ప్రభుత్వం పునరాలోచించాలి. – ఇసాక్, నంద్యాల

పంటకు నీరందక.. ఆశలు పండక!

- ఎల్లావత్తుల చెరువులో అరకొరగా నీరు
- సాగునీరందక 200 ఎకరాల్లో ఎండుతున్న వరి పైరు
- రాత్రింబవళ్లు శ్రమిస్తున్నా తడవని పొలాలు
- లబోదిబోమంటున్న రైతులు

ఎల్లావత్తుల–బీరవోలు గ్రామాల మధ్యనున్న చెరువు ఆక్రమణలకు గురవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. దీనికి తోడు పూడిపోవడంతో పాటు తెలుగుగంగ కాలువ నుంచి నీటిని మళ్లించే అవకాశం లేకపోవడంతో చెరువులో అరకొరగా చేరిన వర్షపు నీరు మాత్రమే నిల్వ ఉంది. దీంతో చెరువు కింద ఉన్న 250 ఎకరాల ఆయకట్టులో వరి పైరుకు నీరు అందక పంట ఎండుదశకు చేరుకుంది. నీటి కోసం రైతుల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి.



బీటలు వారిన వరి పొలం, ఎండిన వరిపైరు



సాగు నీరందక వరి పొలాన్ని వదిలేసిన రైతు

రుద్రవరం: చెరువులో అరకొర నీరుండటం.. పంట కాల్వల నుంచి పూర్తిస్థాయిలో నీరు పారక సాగు నీటి కోసం రైతుల మధ్య ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో రాత్రింబవళ్లు పొలాల్లో ఉంటున్నప్పటికీ పంటకు నీటి తడులందడం లేదు. దీంతో ఎల్లావత్తుల, బీరవోలు రైతుల అవస్థలు వర్ణనాతీతం.

నీటి సమస్య ఇలా..

ఎల్లావత్తుల–బీరవోలు గ్రామాల మధ్య దాదాపు 70 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. చెరువు కింద దాదాపు 250 ఎకరాల ఆయకట్టు ఉంది. గతంలో ఎలాంటి సమస్య లేకుండా సాగు నీరు సమృద్ధిగా పొలాలకు అందేది. పంటలు మంచిగా పండించుకునేవారు. అయితే ఆయా గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు చెరువు అంతర్భాగాన్ని ఆక్రమించి పొలాలుగా మార్చుకున్నారు. అంతర్భాగం కుదించుకు పోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. అలాగే ఆయా గ్రామాలకు చుట్టు పక్కల తెలుగు గంగ ప్రధాన, ఉప ప్రధాన కాల్వలు ఉన్నాయి. ఆ కాల్వల్లోని నీరు చెరువుకు చేరేలా అనుసంధానం చేయలేదు. కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షానికి చెరువుకు అరకొరగా నీరు చేరడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. వెంటనే పొలాల్లో బురద సేద్యాలు చేయించి వరి నాట్లు వేశారు. మొదటి కోటాగా రసాయన ఎరువులు చల్లారు. పది రోజులు తిరక్కుండానే సాగు నీటి సమస్య తలెత్తింది. చెరువులో అరకొరగా ఉన్న నీటిని శిథిలమైన తూముల ద్వారా పంట కాల్వలకు వదిలారు. కాలువలకు సక్రమంగా నీరందకపోవడంతో రైతుల మధ్య గొడవలు మొదలయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను పట్టించుకోకపోవడంతో పంటలు ఎండుదశకు చేరుకున్నాయి. కొందరు రైతులు పంటపై ఆశలు వదులుకొని వదిలేశారు. కొద్ది రోజులు ఇలాగే కొనసాగితే.. రైతులకు భారీగా నష్టవాటిల్లనుందని వారు వాపోతున్నారు.



బీరవోలు చెరువులో అరకొరగా ఉన్న నీరు

15ఎకరాల్లో వరి సాగు చేశా



ఈ ఏడాది 15 ఎకరాల్లో వరి సాగు చేశా. పంట సాగు కోసం దాదాపు రూ.2లక్షల వరకు ఖర్చు చేశా. నాట్లు వేసి పది రోజులు తిరక్కుండానే సాగు నీటి సమస్య జఠిలంగా మారింది. వరికి నీటి తడులు లేక పోవడంతో పొలాలు బీటలు వారాయి. వేసిన నారు ఎండి పోతోంది. రాత్రి, పగలు తిరుగుతున్నా సాగు నీరు అందడం లేదు. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలి లేదంటే రెండు గ్రామాల రైతులు భారీగా నష్ట పోవాల్సి వస్తుంది.– నాగేశ్వరరావు,రైతు ఎల్లావత్తుల

రేయింబవళ్లు కష్టపడుతున్నా నీరందడం లేదు



1.5 ఎకరంలో వరి సాగు చేశా. నాకు భర్త లేదు..ముగ్గురు సంతానం ఉన్నారు. వ్యవసాయ కూలీ పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ప్రస్తుతం కూలీ పనులకు వెళ్లలేక వరికి నీటి తడులు పారించుకునేందుకు తిరగడానికే సరిపోతోంది. గతంలో ఎప్పుడూ ఈ సమస్య లేదు. కూలీ పనులకు వెళ్తే పంట ఎండిపోతుందని భయం. పొలం వద్ద నీరు పారించుకునేందుకు రాత్రి పగలు పడిగాపులు కాయాల్సి వస్తుంది. నీరు అందక వరి పైరు ఎండిపోతోంది. పెట్టుబడులతో,కూలీ పనులకు వెళ్లక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు నెలకొన్నాయి. కుటుంబాన్ని పోషించుకోవడం భారంగా మారింది. – లాల్‌బీ,రైతు ఎల్లావత్తుల

ఓజోన్‌తోనే మనుగడ



నల్లమల అటవీప్రాంతం

- తగ్గుతున్న అడువులతో పొంచివున్న ప్రమాదం
- విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
- పెరుగుతున్న వాయుకాలుష్యం
- నేడు ఓజోన్ దినోత్సవం



నంద్యాల చిన్న చెరువు వద్ద చెత్తా చెదారం

నంద్యాల(రూరల్): ఓజోన్..మానవాళిని మాస్కులా కాపాడుతుంది. సూర్యుడి అతి నీలలోహిత కిరణాలు భూమి మీద పడకుండా కాపాడుతుంది. అయితే ఆ పొర దెబ్బతినేలా వ్యవహరిస్తున్నాం. ఇప్పటికీ రెండు చోట్ల ఓజోన్‌పొర విచ్ఛిన్నమై ప్రమాద ఘంటికలు సూచించింది. అయినప్పటికీ మానవాళి మనుగడలో మార్పు రాక వాయు, శబ్ద, జల కాలుష్యాలతో వాతవరణాన్ని అసమతుల్యత చేసి ఓజోన్‌కు నష్టం కలిగిస్తున్నారు. విచ్చలవిడిగా అడవులు నరికివేయడం, నదీజలాలను కలుషితం చేయడం, పంట పొలాల్లో రసాయన ఎరువుల వినియోగంతో పర్యావరణ తీవ్రంగా కలుషితమవుతోంది. నేడు ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

అంతరించిపోతున్న అడవులు...

ఓజోన్ పొరకు అత్యంత అవసరమైన పచ్చని అడవులు అక్రమంగా కోతకు గురవుతున్నాయి. నంద్యాల జిల్లాలోని నల్లమల అడవులు పదేళ్ల క్రితం 1,39,408 హెక్టార్లలో ఉండేది. ప్రస్తుతం 1,03,289 హెక్టార్లకు తగ్గిపోయింది. అత్యధికంగా కొండ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో అనధికారికంగా చెట్లు నరికివేయడంతో సమస్య ఏర్పడింది.

కాలువల వెంట వ్యర్థాలు..

నంద్యాల జిల్లాలో కుందూ నది, కేసీ కెనాల్, ఎస్‌ఆర్‌బీసీ, గాలేరి నగరి వంటి కాలువలు ప్రవహిస్తున్నాయి. అపారమైన జలవనరులు ఉన్న ఈ ప్రాంతల్లో నది, కాలువల వెంట వ్యర్థ జలాలు, కలుషిత ఆహార పదార్థాలు, పశు కళేబరాలు, రసాయనాలు విడిచిపెడుతున్నారు. ప్లాస్టిక్ సంచులు, బాటిల్స్ నదుల్లో పారవేస్తున్నారు. ఫలితంగా నీరు కలుషితమవుతోంది. జిల్లా కేంద్రంలోని కొన్ని పరిశ్రమల నుంచి ప్రమాదకర వ్యర్థాలు కాల్వలలో కలిసి కలుషితమవుతున్నాయి.

ఓజోన్ పొరను ఇలా కాపాడాలి..

- రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలి.
- పెట్రోలియం ఉత్పత్తుల వాడకం తగ్గించుకోవాలి, వీలైనంతగా ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలి. పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలతో నడిచే వాహనాల నుంచి వెలువడే పొగ ఓజోన్ పొరను దెబ్బతీస్తుంది.
- ఏసీలు, రిఫ్రిజిరేటర్లలో ఏవైనా లీకేజీలు ఉన్నాయా.. అన్నది తరచూ పరీక్షించుకోవాలి. రిఫ్రిజిరేటర్ వెనుక భాగానికి గాలి తగిలేలా ఉంచడం, ఫ్రీజర్ బాక్స్‌లో తగినంత ఉష్ణోగ్రత ఉండేలా, ఉపయోగంలో లేనప్పుడు ఆఫ్ చేయాలి.

మొక్కలు నాటాలి



పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటుంది. ప్రధానంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించింది. ప్రతి చోటా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతోంది. ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. భావితరాలు సురక్షితంగా ఉండాలంటే ఓజోన్ పొరను కాపాడుకోవాలి. పర్యావరణ పరిరక్షణ ద్వారా మాత్రమే అది సాధ్యం.
–నిరంజన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నంద్యాల

ఘనంగా ఇంజినీర్ల దినోత్సవం



విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

నంద్యాల (వ్యవసాయం): భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఆదివారం జాతీయ ఇంజనీర్ల దినోత్సవాన్ని స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్ అధ్యక్షతన, పివి సుధాకర్ రెడ్డి సహకారంతో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రవికృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవిత విశేషాలను వివరించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సీనియర్ అధ్యాపకులు ఉమామహేశ్వరప్ప, జీ.వి.రాజశేఖర్‌రెడ్డిని సన్మానించి పురస్కారం అందజేశారు. క్లబ్ కార్యదర్శి శిరిగిరి రమేష్, జిల్లా చైర్మన్లు రవి ప్రకాష్, చంద్రమోహన్, ప్రసాద్, నాగరాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గోస్పాడు: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఇంజనీర్స్ డే సు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నంద్యాల పట్టణంలోని పంచాయితీ రాజ్‌శాఖా కార్యాలయంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం డీఈ గంగాదర్, నాగరాజులు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సివిల్ ఇంజనీర్‌గా ఎంతో సేవచేశారన్నారు. ఆయన చేసిన ఎన్నో మంచి పనులు ఇప్పటివరకు ఇంజనీర్లందరికి ఎంతో ఆదర్శంగా నిలిచాయన్నారు. అప్పట్లోనే భారతప్రభుత్వం ఆయనకు భారతరత్న అవార్డుతో సత్కరించిందని తెలిపారు. ప్రతి ఇంజనీరు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈ లు రాజశేఖర్‌రెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గోస్పాడు: మండలంలోని తేళ్లపురి గ్రామ కుందూ సమీపంలోని పొలాల్లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటప్రసాద్ తెలిపిన వివరాల మేరకు పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తికి చెందిన మృతదేహం ఉన్నట్లు గ్రామస్తులు గుర్తించి సమాచారమివ్వడంతో వెళ్లి పరిశీలించగా శవం గుర్తు పట్టలేనంతగా మారిందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. ఎవరైనా గుర్తిస్తే ఎస్‌ఐ సెల్ 9121101172 నంబర్‌కు సమాచారం చేరవేయాలని కోరారు.

కోలుకోలేక రైతు మృతి

రుద్రవరం : మండలంలోని ముత్తలూరుకు చెందిన నాగేశ్వరరెడ్డి (44)అనే రైతు నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఎస్‌ఐ వరప్రసాదు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు వ్యవసాయం ఆధారంగా జీవనం సాగించేవాడు. వాతవరణం అనుకూలించక సరైన పంట దిగుబడులు రాక దాదాపు.రూ.12 లక్షల వరకు అప్పు అయ్యింది. అప్పు తీర్చలేక పోవడంతో మనస్థాపానికి గురై ఈనెల 12న పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స అందించినప్పటికి కోలకోలేక మృతి చెందినట్లు మృతుడి భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

వేతనాలు చెల్లించాలి

చాగలమర్రి: ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని మండలంలోని స్కావెంజర్లు కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మూత్ర శాలలు, మరుగుదొడ్లను శుభ్రపరచి, పాఠశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచటానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎస్‌ఎంసీల ద్వారా స్కావెంజర్లను ఏర్పాటు చేసిందన్నారు. మండలంలో 49 మంది స్కావెంజర్లు ఉండగా.. వీరికి అప్పట్లో టాయిలెట్ మేయింటెనెన్స్ ఫండ్ ద్వారా ప్రతి నెల రూ. 6000లు వేతనం చెల్లించేవారని చెప్పారు. ఎన్నికలు సమీపించడంతో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు వేతనాలు చెల్లించలేదన్నారు.

జిల్లా షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 19వ తేదీన నంద్యాల జిల్లా జూనియర్ షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు స్థానిక ఎస్పీజీ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, కార్యదర్శి పరమేశ్వరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ప్రవేశరుసుముతో వయస్సు ధ్రువ పత్రంతో హాజరు కావాలన్నారు. 2005 ఏప్రిల్ 1 తర్వాత జన్మించిన వారు పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

సంబరంగా వినాయక నిమజ్జనం



వాసాపురం వేంకటేశ్వరస్వామి సన్నిధిలో వినాయక నిమజ్జనం గావిస్తున్న దృశ్యం



వేలంలో లడ్డూను దక్కించుకున్న వారితో ఆలయ నిర్వాహకులు

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె పంచాయతీ వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వరస్వామి, మహా త్రిపుర సుందరి, మానస లింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సంబరంగా వినాయక నిమజ్జనం గావించారు. వినాయక చవితి పర్వదినం రోజున ఆలయ ఆవరణలో గణనాథున్ని కొలువుదీర్చారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు గావించి నిమజ్జనం చేశారు. నిమజ్జనానికి ముందు ఆలయ నిర్వాహకులు మధుసూధనరెడ్డి, కమిటీ సభ్యులు స్వామి వారి ప్రసాదాన్ని వేలం వేయగా.. నర్సాపురం గ్రామానికి చెందిన మస్తాన్‌రెడ్డి, రామలక్ష్మమ్మ అనే దంపతులు రూ.41 వేలకు దక్కించుకున్నారు. అనంతరం వినాయక విగ్రహాన్ని ఆలయంలోని కోనేరులో నిమజ్జనం చేశారు.

మహిళల భద్రతకు కమిటీలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంకుమార్

నంద్యాల(న్యూటౌన్): మహిళల భద్రత కోసం కమిటీలు ఏర్పాటు చేసి లైంగిల వేధింపుల నిషేధిత చట్టం 2013 తక్షణం అమలు చేయాలని ప్రజాసామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపీడీఆర్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ రాంకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అరాచకాల నుంచి రక్షణ కోసం 2013లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లైంగిక వేధింపుల నిషేధిత చట్టాన్ని అమలు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కర్నూలులో రాష్ట్ర ప్రధాన హైకోర్టును ఏర్పాటు చేయాలని, లోకయుక్తా, మానవ హక్కుల కమిషన్, వక్ఫ్ బోర్డు ట్రిబునల్ తదితరు న్యాయవ్యవస్థకు సంబంధించిన శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రజాసామ్య హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌రావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, సహాయక కార్యదర్శి ఈశ్వర్, శివశంకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు నరసింహులు, కరుణాకర్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చాగలమర్రి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం ప్రధానోపాధ్యాయుడు కోటయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ అనురాధ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారందరూ 20 సంవత్సరాల తరువాత తమ స్వగ్రామంలో చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వెసుకొని, ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ఎంఈఓ అనురాధ, రమణమ్మ, సరస్వతి, విజయ భాస్కర్‌రెడ్డి, నాగేంద్ర ప్రసాద్, సుధాకర్‌గుప్తా, సుధీంద్ర శాస్త్రీ, హెచ్‌ఎం కోటయ్య, పీడీ దాదాపీర్, గురుశేఖర్‌లను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం దివంగతులైన పూర్వపు ఉపాధ్యాయులు తాగూర్, బయ్యపురెడ్డిలు అందించిన సేవలను కొనియాడి, వారి మృతికి సంతాపం తెలిపారు. అలాగే దివంగతులైన పూర్వ విద్యార్థులు గోపాల్ రెడ్డి, శంకర్, నాగార్జున, నసీరుద్దీన్, భాస్కర్, చిన్నరాజుల ఆత్మకు శాంతికలగాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు జానీ, జయరాముడు, హేమంత్, రాఘవ, సుబ్బ నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల దురాక్రమణను ఆపాలి



వక్ఫ్‌బోర్డు స్థలంలో నిర్మించిన భవనం ఎదుట మాట్లాడుతున్న ముస్లిం జేఏసీ నాయకులు

నంద్యాల(అర్బన్) పట్టణంలో వందల కోట్ల రూపాయల విలువ చేసే వక్ఫ్ ఆస్తులు దురాక్రమణకు గురవుతున్నాయని, ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులను విఫలం అవుతుందని నంద్యాల అసెంబ్లీ ముస్లిం జేఏసీ కన్వీనర్ గన్నీ అబ్దుల్ కరీం తెలిపారు. రైతునగర్ సమీపంలో శిల్పానగర్ వద్ద వక్ఫ్‌బోర్డు స్థలంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను జేఏసీ నాయకులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అక్రమ కట్టడాలను నిలిపి వేసి వక్ఫ్ ఆస్తులను కాపాడాలంటూ పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. వక్ఫ్ స్థలాల్లో కట్టడాలు నిర్మించుకుంటున్నా అధికారులు, రాజకీయ నాయకులు అండదండలు ఇవ్వడం సరైందికాదన్నారు. అక్రమ కట్టడాలను నివారించి వక్ఫ్ ఆస్తులను కాపాడాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు ముల్లా ఖాజాహుస్సేన్, సుహైల్‌రానా, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.